

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 29-09-2025 | సంపుటి - 25 | సంచిక -137 | రూ : 4 | పేజీలు: 8


## శాంతించిన మూసీ..

### ఎంజీబీఎస్‌లో బురద తొలగింపు పనులు వేగవంతం

- మూసీ నదికి తగ్గిన వరద ఉద్ధృతి
- ఎంజీబీఎస్‌లో భారీగా పేరుకుపోయిన బురద
- శుభ్రపరిచే పనుల్లో నిమగ్నమైన ఆర్టీసీ సిబ్బంది
- మధ్యాహ్నం నుంచి బస్సులకు అనుమతి లభించే అవకాశం
- ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి కొనసాగుతున్న బస్సు సర్వీసులు



2లో

### చంద్రబాబు, వైఎస్ఆర్

## భావితరాల కోసం ఆలోచించారు

- పదేళ్లలో న్యూయార్క్‌ను మరిపించే నగరం నిర్మిస్తానని సీఎం రేవంత్ రెడ్డి ధీమా
- రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి శంకుస్థాపన
- ప్రాజెక్ట్‌పై వస్తున్న విమర్శలను ఖండించిన ముఖ్యమంత్రి
- ఇది తన వ్యక్తిగత ఆస్తుల కోసం కాదని, భవిష్యత్ తరాల కోసమేనని స్పష్టీకరణ



2లో

## తిరుమల బ్రహ్మోత్సవాల్లో 'భూత కోల'.. భగ్గుమన్న భక్తులు!

- శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భూత కోల ప్రదర్శన
- తీవ్ర వివాదంగా మారిన జానపద నృత్యం
- ఇది హిందూ సంప్రదాయం కాదంటూ భక్తుల ఆగ్రహం
- ఆత్మలకు సంబంధించిన పూజగా ఆరోపణలు



2లో

### టీడీపీ కేడర్ తో

## చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

- జీఎస్టీ ఉత్సవ్ నిర్వహణపై పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలకు సూచనలు
- రాష్ట్రానికి ఆదాయం తగ్గినా ప్రజలకు పెద్ద ఎత్తున లబ్ది చేకూరుతుందని వ్యాఖ్య
- కేంద్రం తీసుకొచ్చిన ఈ మార్పులను ప్రజలకు వివరించాలని క్యాడర్కు దిశానిర్దేశం



2లో



2లో

## తిరుమల కొండపైకి వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలకు బ్రేక్!

- గరుడ సేవ సందర్భంగా తిరుమలకు పోటెత్తిన భక్తజనం
- 4 వేల వాహనాలతో నిండిపోయిన పార్కింగ్ ప్రదేశాలు
- కొండపైకి ప్రైవేట్ వాహనాల అనుమతిని నిలిపివేసిన అధికారులు
- భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని టీటీడీ సూచన
- అలిపిరి వద్ద వేలాదిగా నిలిచిపోయిన వాహనాలు, భారీ ట్రాఫిక్

### తెలంగాణ గ్రూప్2

## తుది ఫలితాలు విడుదల

- టీజీపీఎస్సీ గ్రూప్-2 ఫైనల్ ఫలితాలు శనివారం విడుదల
- మొత్తం 783 ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి
- 5.5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా తుది జాబితా ప్రకటన
- దసరా పండుగలోపే నియామక పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు
- పరీక్షల తర్వాత 10 నెలల్లోనే ఫలితాలు ఇచ్చామన్న టీజీపీఎస్సీ చైర్మన్
- అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న మెరిట్ జాబితా




2లో

### రూ. 4,621 కోట్లతో భారీ ప్రాజెక్టు..

## రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు శ్రీకారం

- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ను కలుపుతూ రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారి
- నేడు పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి

2లో

## ప్రపంచ రికార్డుకు 'బతుకమ్మ' సిద్ధం





## చెరువులను చెరబడితే తాట తీస్తాం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైడ్రాకు జైకొట్టిన భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్
- తక్కువ ధర అంటూ తటాకాల స్థలాలను కొని పేదలు మోసపోవద్దు: సీఎం రేవంత్‌రెడ్డి
- అంబర్‌పేట బతుకమ్మకుంట పునఃప్రారంభం
- 39 ఎస్టీపీల నిర్మాణానికి శంకుస్థాపన

2లో

## కరూర్ తొక్కిసలాట

2లో

### 40కి చేరిన మృతుల సంఖ్య.. న్యాయస్థానం మెట్లెక్కిన విజయ్ పార్టీ

# కరూర్ తొక్కిసలాట: 40కి చేరిన మృతుల సంఖ్య.. న్యాయస్థానం మెట్లెక్కిన విజయ్ పార్టీ



తమిళనాడు, 28 సెప్టెంబర్ : తమిళనాడులో నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ నిర్వహించిన రాజకీయ సభలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటన తీవ్ర రాజకీయ, న్యాయపరమైన మలుపు తీసుకుంది. 40 మంది ప్రాణాలు బలిగొన్న ఈ విషాదంపై స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపించాలని కోరుతూ స్వయంగా విజయ్ పార్టీయే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడం గమనార్హం. ఈ ఘటనపై తమ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం మధ్యాహ్నం 2:15 గంటలకు మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం అత్యవసరంగా విచారించనుందని టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ సి.టి.ఆర్. నిర్మల్ కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ జస్టిస్ ఎం. దండపాణి నివాసంలో తమ న్యాయవాదుల బృందం అత్యవసరంగా ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు ఆయన వివరించారు. జనసందోహం నిర్వహణ, భద్రతా ఏర్పాట్లలో జవాబుదారీతనాన్ని నిర్ధారించేందుకు స్వతంత్ర విచారణ అవసరమని కోర్టుకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. శనివారం సాయంత్రం కరూర్ లోని వేలుసామిపురంలో జరిగిన ఈ బహిరంగ సభలో తొక్కిసలాట చోటుచేసుకుంది. విజయ్ ప్రసంగాన్ని వినేందుకు వేలాదిగా జనం ఉదయం నుంచే తీవ్రమైన ఎండలో వేచి ఉన్నారు. అయితే, సరైన ఆహారం, నీరు, వైద్య సదుపాయాలు లేకపోవడం, విజయ్ రాక ఆలస్యం కావడంతో జనం ఒక్కసారిగా వేదిక వద్దకు చొచ్చుకురావడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరుకైన దారుల్లో తొక్కిసలాట జరిగి ఊపిరాడక, కాళ్ల కిందపడి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 9 మంది చిన్నారులు, అధికశాతం మహిళలు ఉన్నారు. మరో 60 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, రిటైర్డ్ జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ఇది ప్రభుత్వ భద్రతా వైఫల్యం వల్లే జరిగిందని, ఇది మానవ తప్పిదమని తీవ్రంగా ఆరోపించారు. మృతుల సంఖ్య పెరుగుతుండటం, ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, న్యాయస్థానం జోక్యంతో ఈ ఘటనపై రాబోయే రోజుల్లో రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## తిరుమల కొండపైకి వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలకు బ్రేక్!

తిరుమల, సెప్టెంబర్ 28 : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా అత్యంత వైభవంగా జరిగే గరుడ సేవకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు జనసంద్రంగా మారాయి. అంచనాలకు మించి భక్తులు పోటెత్తడంతో రద్దీని నియంత్రించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తిరుమల కొండపైకి ప్రైవేట్ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల ద్వారా కూడా భక్తులు కాలినడకన పెద్ద సంఖ్యలో తిరుమలకు చేరుకుంటున్నారు. దీంతో తిరుమల క్షేత్రం మొత్తం గోవింద నామస్మరణతో మారుమోగుతోంది. కొండపైకి చేరుకోవాలనుకునే భక్తులు తప్పనిసరిగా ఆర్టీసీ బస్సులను మాత్రమే ఆశ్రయించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో అలిపిరి వద్ద వేలాది వాహనాలు నిలిచిపోయాయి. దీంతో తిరుపతిలోని సప్తగిరి తనిఖీ కేంద్రం నుంచి గరుడ సర్కిల్ వరకు ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఇప్పటికే పార్కింగ్ ప్రదేశాలన్నీ దాదాపు 4,000 వాహనాలతో నిండిపోయినట్లు సమాచారం. మరోవైపు, గరుడ వాహనంపై శ్రీవారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో తిరుమాడ వీధుల్లోని గ్యాలరీలన్నీ పూర్తిగా నిండిపోయాయి. గ్యాలరీలు కిక్కిరిసిపోవడంతో భక్తులను మాడ వీధుల్లోకి అనుమతించడం లేదు. నందకం, రామ్ భగీచా, లేపాక్షి సర్కిళ్ల వరకు భక్తులు బారులు తీరిన పరిస్థితి కనిపిస్తోంది.

## తెలంగాణ గ్రూప్-2 తుది ఫలితాలు విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : తెలంగాణలో గ్రూప్2 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. 2022 నోటిఫికేషన్‌కు సంబంధించిన 783 గ్రూప్2 పోస్టుల తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నేడు ప్రకటించింది. ఇందులో ఒక పోస్టు భర్తీ కాలేదు. టీజీపీఎస్సీ తాజా ప్రకటనతో ఎంపికైన అభ్యర్థుల కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగిన రాత పరీక్షలకు సుమారు 2.5 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసిన కమిషన్, ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు పూర్తి చేసింది. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లు, మెరిట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా తుది మెరిట్ జాబితాను రూపొందించింది. ఈ పరీక్షల్లో 600 మార్కులకు గాను అత్యధికంగా 447.08 మార్కులు నమోదైనట్లు కమిషన్ వెల్లడించింది. ఈ నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, సబ్‌రిజిస్ట్రార్ గ్రేడ్II, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్III, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారికి దసరా పండుగకు ముందే నియామక పత్రాలు అందజేయాలని కమిషన్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఫలితాల విడుదలపై టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, పరీక్షలు నిర్వహించిన 10 నెలల వ్యవధిలోనే తుది ఫలితాలు ఇచ్చామని, గ్రూప్1 వివాదం లేకపోయి ఉంటే ఫలితాలు మరింత తొందరగా వచ్చేవని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా, కట్‌ఆఫ్ మార్కుల వివరాలు అధికారిక వెబ్‌సైట్ `tspsc.gov.in`లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్‌తో ఫలితాలను చూసుకోవచ్చని కమిషన్ సూచించింది.

## చంద్రబాబు, వైఎస్ఆర్ భావితరాల కోసం ఆలోచించారు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : తనకు పదేళ్లు సమయం ఇస్తే, ప్రపంచ ప్రఖ్యాత నగరం న్యూయార్క్‌ను మించిపోయేలా తెలంగాణలో ఒక అద్భుతమైన నగరాన్ని నిర్మించి చూపిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కొందరు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించిన ఆయన, ఈ బృహత్తర ప్రాజెక్ట్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్ తరాల ఉజ్వల భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఆదివారం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "విదేశాలకు వెళ్లి వచ్చిన ప్రతి ఒక్కరూ న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ నగరాల గొప్పదనం గురించి చెబుతుంటారు. మనం ఇంకెన్నాళ్లు ఆ నగరాల గురించి మాట్లాడుకుంటూ ఉండిపోవాలి? అలాంటి ప్రపంచ స్థాయి నగరాన్ని మన తెలంగాణలో ఎందుకు నిర్మించుకోలేం?" అని ప్రశ్నించారు. ప్రజలు తనకు అవకాశం ఇస్తే, పదేళ్లలోనే ఆ కల సాకారం చేసి చూపిస్తానని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మరో 70 ఏళ్ల తర్వాత కూడా ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలపైనా ఆయన స్పందించారు. "కొందరు ఈ ప్రాజెక్టును నా వ్యక్తిగత ఆస్తుల కోసం చేస్తున్నానని అనవసర ఆరోపణలు చేస్తున్నారు. ఇది అవాస్తవం. ఇది నా కోసం కాదు, మన పిల్లల భవిష్యత్తు కోసం నిర్మిస్తున్న నగరం" అని ఆయన గట్టిగా చెప్పారు. గతంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర రెడ్డి లాంటి నాయకులు దూరదృష్టితో ఆలోచించడం వల్లే ఈరోజు తెలంగాణలో హైటెక్ సిటీ, శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు. గత పాలకుల నుంచి మంచిని స్వీకరించి ముందుకు సాగాలన్నదే తన విధానమని తెలిపారు. ఈ ఫ్యూచర్ సిటీలో బుల్లెట్ రైళ్లు, అత్యాధునిక రవాణా వ్యవస్థలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, ప్రపంచ స్థాయి విద్యా, వైద్య సంస్థలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికంగా వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం విజయవంతం కావడానికి స్థానిక ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ కేడర్ తో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

అమరావతి, సెప్టెంబర్ 28 :వస్తు సేవల పన్ను (జీఎస్టీ) లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు దేశం చరిత్రలోనే నూతన అధ్యాయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సంస్కరణలతో రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గుతుందని, అయితే, రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు పెద్ద ఎత్తున లబ్ధి జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఉదయం తెలుగుదేశం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గ్రామస్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ క్యాడర్ కు చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న 'జీఎస్టీ ఉత్సవ్' కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జీఎస్టీ సంస్కరణలతో ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ మార్పులను ప్రజలకు వివరించి చెప్పాలని పేర్కొన్నారు. కనీసం రాష్ట్రవ్యాప్తంగా 60 వేల సమావేశాలు పెట్టి జీఎస్టీ సంస్కరణలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కూటమిలోని పార్టీలు ఉమ్మడిగా జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ ప్రచారాన్ని నిర్వహించాలని చెప్పారు. ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని ఆయన గుర్తుచేశారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు రూ. 8 వేల కోట్ల మేర లబ్ధి జరగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. పారిశ్రామిక, ఆటో మొబైల్, ఫార్మా, వంటి కంపెనీలకు మేలు జరుగుతుందన్నారు. టూ వీలర్, ఏసీలు, కార్లు, వంటి ఇంటి వస్తువుల ధరలు తగ్గుతాయని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని చెప్పారు. రోగులు వాడే మందులపై జీఎస్టీ లేదన్నారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గినా సంస్కరణల వల్ల ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవుతారని వివరించారు. సుపరిపాలన కార్యక్రమం ద్వారా ప్రజలకు ఏం చేశామో వివరించాం.. ఇప్పుడు కూడా అదే తరహాలో జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమాన్ని చేపట్టాలని చంద్రబాబు సూచించారు. కార్యకర్తల భాగస్వామ్యంతోనే యోగాడే సక్సెస్ అయిందని, అలాగే జీఎస్టీ ఉత్సవ్ ను కూడా సక్సెస్ చేయాలని పార్టీ కేడర్ కు చెప్పారు. కార్యకర్తలైనా.. నాయకులైనా ఎల్లప్పుడూ ప్రజలకు చేరువగా ఉండాలని, మంచి చెడులను ప్రజలకు వివరించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్తానంటే జనం హర్షించరని హెచ్చరించారు.

## శాంతించిన మూసీ.. ఎంజీబీఎస్‌లో బురద తొలగింపు పనులు వేగవంతం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : హైదరాబాద్ నగరానికి ఊరట లభించింది. మూసీ నదికి వరద ఉధృతి తగ్గడంతో నగరంలోని కీలకమైన మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటోంది. వరద నీరు వెనక్కి వెళ్లినప్పటికీ, బస్ స్టేషన్ ప్రాంగణంలో భారీగా బురద పేరుకుపోయింది. దీంతో ఆర్టీసీ అధికారులు పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేశారు. ముఖ్యంగా ఎంజీబీఎస్‌కు వచ్చే దారిలోని శివాజీ బ్రిడ్జి వద్ద, బస్ స్టేషన్‌లోని 56, 58, 60 నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద బురద పేరుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, ఆర్టీసీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన శుభ్రపరిచే పనులను చేపట్టారు. బురదను పూర్తిగా తొలగించిన తర్వాత ఈరోజు మధ్యాహ్నం నుంచి బస్సులను తిరిగి ఎంజీబీఎస్‌లోకి అనుమతించే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి జిల్లాలకు వెళ్లే బస్సు సర్వీసులను నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి నడుపుతున్నారు. ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, జేబీఎస్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక పికప్ పాయింట్లకు చేరుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు కూడా ఈ తాత్కాలిక పికప్ పాయింట్ల నుంచే బస్సులు ఎక్కాలని స్పష్టం చేశారు.

## చెరువులను చెరబడితే తాట తీస్తాం



ఒకేసారి పది వేల మందితో బతుకమ్మ ఆడించి గిన్నిస్ రికార్డుల్లో స్థానం దక్కించుకోవడమే లక్ష్యంగా సోమవారం నిర్వహించనున్న కార్యక్రమానికి సరూర్‌నగర్ మున్సిపల్ స్టేడియం ముస్తాబైంది. మైదానంలో 66.5 అడుగుల ఎత్తయిన బతుకమ్మను అధికారులు ఏర్పాటు చేశారు. పర్యాటకశాఖ ఎండీ వల్లూరి క్రాంతి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ పంకజ, ఇతర ఉన్నతాధికారులు ఆదివారం ఇండోర్ స్టేడియంలో జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పది వేల మంది మహిళలు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ, పాటలు పాడుతుండగా గిన్నిస్ బుక్ ప్రతినిధులు వివరాలను నమోదు చేసుకుని ఫలితాన్ని ప్రకటిస్తారని జీహెచ్ఎంసీ తెలిపింది.

## చెరువులను చెరబడితే తాట తీస్తాం...



హైదరాబాద్; అంబర్‌పేట, విద్యానగర్: రాష్ట్రంలో చెరువులను ఎవరు చెరబట్టినా తాట తీస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే భావితరాల కోసం, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కోసం హైడ్రాను ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నానని ఆయన గుర్తు చేశారు. విమర్శలు, ఆరోపణలను ఎదుర్కొని పని చేయడం వల్లే 35 ఏళ్ల క్రితం కనుమరుగైన బతుకమ్మకుంటను మళ్లీ బతికించుకున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మొదటి దశలో చేపట్టిన ఆరు చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో బతుకమ్మకుంట ప్రధానమైనది. ఐదు ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ తటాకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పునః ప్రారంభించారు. స్థానిక నేతలతో కలిసి గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'హైడ్రా' పాటను ఆవిష్కరించి అక్కడే ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. అంతకుముందు స్థానిక భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ రాజకీయాలకు అతీతంగా మాట్లాడుతున్నానంటూ.. సీఎం చేపట్టిన కార్యక్రమాన్ని ప్రశంసించారు. హైడ్రా వల్ల హైదరాబాద్‌కు మేలు జరుగుతోందని కితాబిచ్చారు. 'నా నియోజకవర్గం పరిధిలో మూసీ నది అభివృద్ధికి సహకరిస్తా. ఇళ్లు కోల్పోయే పేదలకు స్థానిక పోలీసు భూముల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. ఆ భూమిలోనే నియోజకవర్గానికి అవసరమైన అన్ని కార్యాలయాలను నిర్మించండి' అని కోరగా సీఎం అందుకు సరే అన్నారు. వెంటనే సర్వే చేపట్టి.. నియోజకవర్గం అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఆయన యంత్రాంగాన్ని ఆదేశించారు. డిసెంబరు 9 నాటికి అవసరమైన నిధులు, అనుమతులు మంజూరు చేస్తానని చెప్పారు.

## రూ. 4,621 కోట్లతో భారీ ప్రాజెక్టు.. రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు శ్రీకారం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో మరో కీలక ఘట్టానికి తెరలేవనుంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) లను అనుసంధానించే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారి' నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు నగర శివారు ప్రాంతాల స్వరూపాన్నే మార్చేస్తుందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుందని అధికారులు భావిస్తున్నారు. రావిర్యాల్ ఓఆర్ఆర్ ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమన్‌గల్ వరకు మొత్తం 41.50 కిలోమీటర్ల పొడవునా ఈ రహదారిని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ. 4,621 కోట్లు వెచ్చించనుంది. ఇప్పటికే హెచ్ఎండీఏ ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. ఒప్పందం ప్రకారం, నిర్మాణ పనులను 30 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలోని ఆరు మండలాల్లోని 14 గ్రామాల గుండా ఈ రహదారి ప్రయాణించనుంది. గ్రీన్‌ఫీల్డ్ రహదారి కేవలం రవాణా సౌకర్యాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 'ఫ్యూచర్ సిటీ'కి ఒక ప్రత్యేక కారిడార్‌గా నిలవనుంది.

## తిరుమల బ్రహ్మోత్సవాల్లో 'భూత కోల'... భగ్గుమన్న భక్తులు!

తిరుమల, సెప్టెంబర్ 28 :కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన 'భూత కోల' అనే నృత్య ప్రదర్శన తీవ్ర దుమారం రేపుతోంది. ఇది హిందూ ఆలయ సంప్రదాయాలకు విరుద్ధమని, ఇలాంటి కార్యక్రమాలను పవిత్రమైన తిరుమల కొండపై ఎలా అనుమతిస్తారని భక్తులు, నెటిజన్లు టీటీడీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఈ భూత కోల ప్రదర్శనను నిర్వహించారు. అయితే, ఈ ప్రదర్శనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం మొదలైంది. 'భూత కోల' అనేది ఆత్మలకు శాంతి చేకూర్చేందుకు చేసే ఒక ఆచారమని, దీనిని ఆలయాలలో, ముఖ్యంగా తిరుమల వంటి పుణ్యక్షేత్రంలో ప్రదర్శించడం సరైంది కాదని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలి

*** ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్**

మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ అన్నారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా ఉప్పల్ డిపో ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద భగత్ సింగ్ చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ పంజాబ్ ప్రాంతంలోని ఖత్కర్ కలాన్ అనే గ్రామంలో 1907 సెప్టెంబర్ 28 న కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించారన్నారు. 3 సంవత్సరాల వయసులో తుపాకీ మొక్కలు నాటిన విప్లవ బాలుడు, 20 సంవత్సరాల కాలంలోనే బ్రిటిష్ వారిని గడ గడ లాడించి, 23 సంవత్సరాల వయసులోనే భారత మాత దాస్య శృంఖలాల నుండి విడిపించడం కోసం ప్రాణ త్యాగం చేసి, ప్రతి భారతీయుడిలో విప్లవాగ్నిని రగిలించిన యోధుడన్నారు. భగత్ సింగ్ అంటేనే ఒక మండే అగ్నిగోళం, జ్వలించే నిప్పుకణిక దేశ స్వాతంత్ర్యం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించి,దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ఉరికొయ్యను ముద్దాడారన్నారు. నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వం



వారిని ఉరి తీసింది. ఉరికొయ్య ముందు ఏ మాత్రం భయపడలేదన్నారు. ఆ ధైర్యమే ప్రవాహంలా మారి నేటి తరాలకు చేరిందన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి, యువత పోరాడాలని, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చి, జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్ నాయకులు,అరవింద్, శ్రీహరి,సాయి,కృపాకర్,ధీరజ్,నవీన్,గణేష్, నితిన్,తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట లో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్టలో, సంజయ్ పూరి కాలనీ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జె కె శేఖర్ యాదవ్ కుమారుడు యువ నాయకుడు జెల్ల ఆర్థిక యాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయూరారోగ్యాలతో ఉండాలన్నారు. అదేవిధంగా దేవి నవరాత్రులు నిష్టగా జరుపుకోవాలన్నారు. దసరా పండుగను సంతోషంగా శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాప్రాలో ఘనంగా దుర్గామాత మండపంలో చండీ హోమం



ప్రజాస్ఫూర్తి, కాప్రా: కాప్రాలో ఆదివారం నవదుర్గ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన నవరాత్రుల దుర్గామాత మండపంలో ఆదివారం ఘనంగా చండీ హోమం నిర్వహించబడింది. అమ్మవారు ఆధ్యాత్మిక శక్తిని ప్రదర్శించే ఈ హోమంలో యువత సభ్యులు, కాలనీవాసులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉత్సాహపరిచారు. హోమంలో భాగంగా పూజ, మంత్రోచ్చారణ, హోమ గృహంలో ఆహుతులు సమర్పించడం జరుగగా, పాల్గొన్నవారందరూ భక్తి భావంతో హోమాన్ని పరిశీలించారు. నవదుర్గ యూత్ నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఇలా చండీ హోమం ద్వారా కాప్రా గ్రామంలో సంప్రదాయాన్ని కొనసాగించడమే కాదు, యువతలో ఆధ్యాత్మిక అవగాహన పెంపొందించడం లక్ష్యం అని అన్నారు. హోమం కార్యక్రమం అనంతరం స్థానికులు పరస్పర అభినందనలు తెలిపారు మరియు భక్తిమయ వాతావరణంలో సాంప్రదాయ ఉత్సవం జరిగింది.

## ప్రకృతి హరిత దీక్షలో చిరంజీవి మహమ్మద్ అఫాన్ జైదీ ఆదర్శం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం మాతశిశు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రకృతి హరిత దీక్షుడు, ప్రకృతి ప్రేమికుడు చిరంజీవి మహమ్మద్ అఫాన్ జైదీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తన రెండవ పుట్టినరోజు నుండే ప్రకృతి హరిత దీక్ష తీసుకొని, మొక్కలు నాటడమే కాక వాటిని సంరక్షించే సేవలో చురుకుగా పాల్గొంటున్న అఫాన్ జైదీ, ఈసారి తన తాతయ్యానానమ్మ దంపతులు ముస్తఫా,పర్వీన్ సహకారంతో పండ్ల మొక్కలు నాటాడు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ రాజకీయ నాయకులు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి షేక్ గౌస్ భాయ్ మొట్టమొదటి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించి అఫాన్ జైది సేవాభావాన్ని అభినందించారు. గౌరవ అతిథులుగా ఝాన్సీ దశరథ్, ప్రముఖ రక్తదాత కన్నలతో పాల్గొని మొక్కలు నాటారు. అలాగే అఫాన్ జైదీకి ప్రకృతి హరిత దీక్ష ఇచ్చిన కె.ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ, చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణలో భాగమవుతున్న అఫాన్ జైది, అతనికి మద్దతుగా నిలుస్తున్న కుటుంబ సభ్యులు తాతయ్య,నానమ్మ ముస్తఫా,పర్వీన్, తల్లితండ్రులు రేష్మా,అమన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో తోటి ప్రకృతి హరిత దీక్షులు పారుల్, నైనిక రజువా, బంధువుల చిన్నారులు సాదు మహమ్మద్ సాద్, షాకీర్, సిహాబ్, ఆలియా, అతియ, ఆసియా, ఆసిమా, యాస్మిన్, అప్స తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు నాటిన ప్రతి ఒక్కరిని అభినందిస్తూ, భవిష్యత్ తరాల కోసం పచ్చదనం పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.



## ప్రజాసేవలో అందరికీ ఆదర్శంగా నిలిచి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలి

*** గ్రూప్ వన్ ఉద్యోగం పొందిన రంజిత్ రెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎందరో విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన రంజిత్ రెడ్డి, ప్రజాసేవలో అందరికీ ఆదర్శంగా నిలిచి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్ వన్ ఫలితాల్లో 43వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్ గా ఉద్యోగం సాధించిన జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురి కాలనీకి చెందిన అక్కెనపల్లి రంజిత్ రెడ్డి ఆదివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రూప్ వన్ ఉద్యోగం సాధించిన రంజిత్ రెడ్డిని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శాలువాతో సత్కరించి అభినందించారు. రంజిత్ రెడ్డి జీవిత నేపథ్యం ... చింతల్ లోని రెయిన్బో స్కూల్ లో పదవ తరగతి పూర్తిచేసి, మాసబ్ ట్యాంక్ లోని పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ పూర్తిచేసి, సీబీఐటి కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేశారు. కాగా చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉన్న రంజిత్ రెడ్డి తల్లిదండ్రులు కూలిపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉండగా 2022 సంవత్సరంలో తండ్రిని కోల్పోయిన రంజిత్ రెడ్డి స్థానిక వైష్ణవీ టెక్నో స్కూల్ లో టీచర్ గా పనిచేస్తూ తల్లి ప్రేరణతో "టీచర్" గా పనిచేస్తూనే జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే గ్రూప్ వన్ కు సంసిద్ధం అవుతూ మొదటి ప్రయత్నంలోనే డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాన్ని సాధించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రెజ్లింగ్ శిక్షణలో ఉత్సాహంగా పాల్గొంటున్న బాల, బాలికలు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆమెచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21 తేదీ నుండి 3 ఇంక్లైన్ లోని తెలంగాణ క్రీడా మైదానం లో ప్రారంభమైన రెజ్లింగ్ శిక్షణ శిబిరం లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 30 మంది బాల,బాలికలు ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఎంతో ఉత్సాహంతో పాల్గొంటున్నారు. వీరిలో గతంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో సైతం ప్రతిభ కనబరిచి పత కాలు గెలుపొందిన క్రీడాకారులు పాల్గొనడం విశేషం త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్ , సీఎం కప్, పలు అసోసియేషన్ లు నిర్వహించే రెజ్లింగ్ పోటీలలో సత్తా చాటి పతకాలు గెలుపొందేందుకు ఈ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ శిక్షణ లో పాల్గొంటున్న క్రీడాకారులు పోటీలలో ప్రతిప కనబరిచి పతకాలు గెలుపొందేందుకు ఈ శిక్షణ శిబిరం ఎంతో గానో దోహదపడుతుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి .కాశీ హుస్సేన్ పేర్కొన్నారు. జాతీయ సీనియర్ క్రీడాకారిని నిహారిక కోచ్ గా వ్యవహరిస్తూ కొనసాగుతున్న ఈ శిబిరం మరొక 5 రోజులపాటు కొనసాగుతున్నట్లు కాశీ హుస్సేన్ తెలిపారు ఈ శిబిరం నిర్వహణకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా క్రీడాధికారి యం. పరంధామరెడ్డి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నాగ సీతారాములు తగు ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు కాశీ హుస్సేన్ పేర్కొన్నారు.

## రాయగిరిలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



యాదాద్రి భువనగిరి ప్రజాస్ఫూర్తి : ఆదివారం రాయగిరి లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వ్యక్తి నిర్మాణం తో పాటు దేశభక్తుల్ని కూడా తయారు చేస్తూ సమాజం లో ప్రముఖ (ప్రావు వహిస్తుందని తిప్పళ్ల యాదగిరి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన కటకం నామదేవు, విభాగ్ గో సేవా ప్రముఖ మాట్లాడుతూ డాక్టర్ హెడ్గేవార్ స్పష్టమైన దృరోణం ఖచ్చితంగా ఉండేది. " సంఘ్ ఒక సంస్థ కారు. యావత్ సమాజమీ సంఘ్". హిందూ సమాజం ఒకే దిశలో కదలగలగాలి, ఒకే స్వరం తో భారతమాత గురించి గతం ఎత్తగలగాలి అని ఆయన ప్రారంభించం. ఈ యాత్ర నేడు. కోట్లాది ప్రజల మనోభావాలకు ప్రేరణగా నిలుస్తోంది. రజతోత్సవం కూడా జరపరాదని ఆయన చెప్పినటి సంఘ్ ఆలోచనలని గంభీరతను సూచిస్తుంది. ఉత్సవం కంటే సమాజ సాధనకే వారు ప్రాధాన్యం ఇచ్చారు. అని అన్నారు. ఇంకా సంస్కృతి సంరక్షణ, కుటుంబ ల తద్వారా సమ సమాజం ప్రబోధం, జీవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ లో చైతన్యం గొల్పుతూ మన దేశాన్ని పునరుత్తేజం వైపు నడపాలని అన్నిరు. ఈ కోర్యక్రమంలో ఘోష్ యంగళ వాయిద్యాలతో) స్వరార్చన కూడా చేస్తారు. దీం స్థానక్ రాయిగిరి నుండి దాదాపు 50మంది స్వయం సేవకులు పాల్గొన్నారు. అనీ ముద్దం కదులాకర్ భువనగిరి నగర సహ కార్నవాడగ తదితరులు పాల్గొన్నారు

## నందానగర్ లో దేవి శరన్నరాత్రి ఉత్సవాలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మండపం వద్ద అమ్మవారి చండీ హోమం , అన్నప్రసాద కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బి విజయ్ శేఖర్ గౌడ్ హజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నందానగర్ బస్తీ వెల్ఫేర్ ప్రెసిడెంట్ బి కార్తీక్ గౌడ్ , బస్తీ పెద్దలు మాజీ అధ్యక్షులు హరిబాబు , పెద్దలు శ్రీనివాస్ , అర్చకులు సతీష్ , సాయి గౌడ్ , మధు, శివ , బస్తీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ కాలనీలో ఘనంగా బతుకమ్మ సంబురాలు



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మేడిపల్లి భగత్ సింగ్ కాలనీలో భారత జాతీయ మహిళా సమైక్య మేడ్చల్ జిల్లా కార్యదర్శి జై. లక్ష్మీ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి వాటిని ఒక చోట ఏర్పాటు చేసి బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కార్యదర్శి జ్యోతి, మాధవి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి నాగరాజ్, మహిళా సమైక్య నాయకులు మహేశ్వరి, మహాలక్ష్మి, అండాలు, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే



ఆలేరు ప్రజా స్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం రాఘవపురం గ్రామంలో దండ్ల నరేష్ చందన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆ లబ్ధిదారులకు ఇచ్చిన మాట ప్రకారం పట్టుబట్టలు, యటాను అందజేశారు. నియోజకవర్గంలో త్వరితగతిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకోవాలన్నారు.రెండో విడతలో మరో కొంత నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు.

# అంతర్జాతీయ సంజ్ఞా భాషా దినోత్సవ వేడుకలు





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ సంజ్ఞా భాషా దినోత్సవ వేడుకలు ఐ.డి.ఓ.సి. కలెక్టరేట్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనిన కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా అంతర్జాతీయ సంకేత భాష పోస్టర్ ను ఆవిష్కరించారు . జిల్లా సంక్షేమ అధికారిణి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించడం జరిగింది అని తెలిపారు. సొసైటీలో బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా, ఉద్యోగాలలో బధిరులకు న్యాయం జరిగేలాగా చూస్తామని , అర్హులైన అందరికీ సహాయ ఉపకరణాలు అందిస్తామని, వారి సమస్యలు ఏమున్నా గాని తెలియజేసినట్లయితే జిల్లా కలెక్టర్ , వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కు సమస్యలను వివరించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బదిరుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి మాట్లాడుతూ బదిరులు ఎక్కడికి వెళ్లినా సంకేత భాష విషయంలో తమ సమస్యను పక్క వారికి చెప్పుకోలేక బాధలు పడుతున్నారని, అధికారులు అందరికీ సైగల భాష పై అవగాహన కల్పించాలని, రవాణా శాఖ ద్వారా బధిరులకు డ్రైవింగ్ విషయంలో లైసెన్స్ మంజూరు చేపించాలని, వికలాంగుల నియామకాలు రిజర్వేషన్లను భర్తీ చేయాలని, బధిరులకు కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, మహిళలకు కుట్టుమిషన్ , కంప్యూటర్ శిక్షణలు ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బధిరుల సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ కిషన్, ఖమ్మం జిల్లా అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అధ్యక్షుడు వీరస్వామి, సెక్రటరీ మహేష్ కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బదిరుల సంఘం సెక్రటరీ ఇంతియాజ్ ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ ప్రసన్న ప్రియ , అనువాదకులు అంకిత,కార్యాలయ సిబ్బంది నరేష్ , ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడు

* **ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కే, ఫహీమ్ దాదా**
* **ఘనంగా భగత్ సింగ్ 118వ జయంతి**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి ఎస్ కే, ఫహీమ్ దాదా పిలుపునిచ్చారు. షహీద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం లోని టూ ఇంక్లైన్ దగ్గర ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కే, ఫహీమ్ దాదా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని వారు కొనియాడారు. 1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్ సింగ్ 23 ఏళ్ళ చిరు ప్రాయంలోనే 1931 మార్చ్ 23న తన సహచరులు రాజ్ గురు, సుఖ్ దేవ్ లతో కలిపి ఉరితీయబడ్డారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావ శీల విప్లవకారులలో భగత్ సింగ్ అగ్రగణ్యుడని, ఈ కారణంగానే షాహీద్ గా దేశ ప్రజలు కొనియాడారని వారు గుర్తు చేశారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యూం ఉపాధ్యక్షులు బరిగెల భూపేష్ జిల్లా కౌన్సిల్ మెంబర్ రసూల్ పాషా, పట్టణ నాయకులు సల్మాన్, మణికంఠ, అప్రోచ్, సంజయ్, జావీద్, అక్షయ్, రవి, రణధీర్, వంశీ, అన్మోల్, అమన్, అష్రాఫ్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆరాధనతో ధైర్యం పెరుగుతుంది

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) :శక్తి ఆరాధన ద్వారా భయం తొలగుతుంది. అమ్మవారి ఆరాధనతో ధైర్యం పెరుగుతుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి సాయి కృపా అపార్ట్మెంట్ లో , కొంపల్లి మున్సిపాలిటీ పరిధి "అపర్ణ పామ్ గ్రో" నందు ఏర్పాటు చేసిన దుర్గామాత నవరాత్రి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తికి రూపం అమ్మవారి స్వరూపమని, అమ్మ దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలన్నారు . ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ కౌన్సిలర్ పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు ఎండీ.ఖాదర్ (షన్ను భాయ్), భూలక్ష్మణ్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



## అయోధ్య నగర్ లో ఘనంగా శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలు

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అయోధ్య నగర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ తల్లి ఆలయం వద్ద ఆలయ కమిటీ వారు నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం. ప్రతాప్ విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ, అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు కలిగించాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతమ్మ తల్లి ఆలయ ధర్మకర్తలు అచ్చిబాబు, శరబయ్య, సుభాష్ నగర్ ఫేస్ 1 సంక్షేమ సంఘం అధ్యక్షులు బిజిల్ కృష్ణ, తిరుపతమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు ధనరాజ్, సురేష్,అరుణ్ గౌడ్, గౌరీ, కామేశ్వరరావు, బాలాజీ, జానకి, రామ్, ఏసుబాబు, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమించాలి

* **డివైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమించాలని డివైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు అన్నారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో దేశ సమైక్యత సమగ్రతలను కాపాడాలని, ఏర్పాటు వాదం, మతోన్మాదం ఉగ్రవాదం, నశించాలని ఆదివారం షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు భగత్ సింగ్ సందేశ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన విప్లవ యువ కిశోరం భగత్ సింగ్అని అన్నారు. భగత్ సింగ్ అసమాన పోరాటస్ఫూర్తితో నేటి సమాజంలో జరుగుతున్న, అన్యాయాలకు, సామ్రాజ్యవాద దోపిడీకి అసమానతలకు, అణచివేతకి వ్యతిరేకంగా యువత పోరాడాలని డివైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పసుల అంజయ్య లు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, పాషా, కృష్ణ ,రవి, లక్ష్మణ్ రాజు, సురేష్,తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టరేట్ లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు




మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా వైద్య ఆరోగ్య, కో ఆపరేటివ్, పరిశ్రమలు, సమాచార శాఖల ఆధ్వర్యంలో అంబరాన్ని అంటే విధంగా బతకమ్మ సంబరాలు జరిగాయి. తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, డిఎం అండ్ హెచ్ ఓ ఉమాగౌరీ, కో ఆపరేటివ్ అధికారి వెంకటరెడ్డి, సమాచార శాఖ అధికారులు నాగాంజలి, స్వర్ణలత సాంస్కృతిక కళాకారులు, మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. సిద్ధిపేట నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా దొంగతనంగా లింగారెడ్డిపల్లికి చెందిన వల్లెపు శ్రీకాంత్ తన టిప్పర్‌లో ఇసుక నింపుకొని పోతుగల్ గ్రామంలో అధిక ధరలకు అమ్మేందుకు వచ్చాడని తెలిపారు. దీంతో ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసి, శ్రీకాంత్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## కొంపల్లిలో యూని ప్లానెట్" ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ప్రారంభం



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : విదేశీ విద్యపై రోజురోజుకు పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని విద్యా ఉపాధి వైపుగా యువత దృష్టి సారిస్తున్నారని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ ఫెయిర్ మౌంట్ స్క్వేర్ నందు పటోళ్ల భరత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "యూని ప్లానెట్" ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ను ఆయనతో పాటు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, ఆంధ్రప్రదేశ్ వైసీపీ నాయకులు బైరెడ్డి సందీప్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశ యువత ఎక్కడ విద్యనభ్యసించినా మన దేశాభివృద్ధికై, యువతకు ఉపాధివైపుగా సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూని ప్లానెట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## గుండాల మండల కేంద్రంలో బతుకమ్మ పండుగ



ఆలేరు ప్రజా స్ఫూర్తి : గుండాల మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , బీర్ల.ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత పాల్గొన్నారు.. మండల కేంద్రంలో ఆడపడుచులు తొమ్మిది చోట్ల బతుకమ్మలు ఆడుతున్న నేపథ్యంలో గతంలో బీర్ల అయిలయ్య ఇచ్చిన మాట ప్రకారం అన్ని చోట్లా బతుకమ్మ ఆడటం కోసం సీసీ రోడ్లు వేయించారు.ఈ సందర్భంగా ఆడపడుచులు బతుకమ్మ. పండుగ ను సంతోషంగా జరుపుకున్నరు.




## సబ్ రిజిస్టర్ ఉద్యోగానికి ఎంపికైన ముస్తాబాద్ వాసి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఇటీవల విడుదలైన గ్రూప్ 2 ఫలితాల్లో ముస్తాబాద్ వాసి చుంచు జితేందర్ సబ్ రిజిస్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. చుంచు మల్లయ్య సునంద దంపతుల కుమారుడు జితేందర్. ఆయన 6వ తరగతి నుంచి చొప్పదండి నవోదయ విద్యాలయం లో విద్యను అభ్యసించారు. పదవ తరగతి సిబిఎస్ఇ సిలబస్‌లో 10జిపిఎ సాధించి అందరిని అబ్బుర పరిచాడు. ఆపై ఉస్మానియా యూనివర్సిటీలో సివిల్ ఇంజనీర్ పూర్తి చేశాడు. ఇప్పటికే జితేందర్ అనేక పోటీ పరీక్షల్లో తన సత్తా చాటాడు. గతంలో టిఎస్‌పిఎస్‌సి అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులకు కూడా ఎంపికయ్యాడు. అంతేకాక, సెంట్రల్ గవర్నమెంట్ సిజిఎల్‌లో కూడా అర్హత సాధించాడు. ప్రస్తుతం ఆగస్టులో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష కూడా రాశారు. ఈ విజయాల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, తమ్ముడి సహకారం ఎంతో ఉందని జితేందర్ గుర్తు చేసుకున్నారు. ముస్తాబాద్ వాసి జితేందర్ సబ్ రిజిస్టర్‌గా ఉద్యోగం సాధించడం పట్ల పలువురు ఆయనను అభినందించారు.

# ప్రగతినగర్ లో ఘనంగా విజయదశమి ఉత్సవం

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : దేశం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో ప్రపంచంలోనే సర్వోన్నతంగా ఎదిగిన నాడు ఆర్ఎస్ఎస్ లక్ష్యం పూర్తవుతుందని తెలంగాణ సామాజిక సమరసత సంయోజక్, అఖిలభారత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ జీ అన్నారు. ప్రగతినగర్ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పట్టాభి రామాంజనేయ దేవస్థానంలో విజయదశమి ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ఏర్పడిన ఈ వంద సంవత్సరాలలో దేశం కోసం ఏమేమి చేశాము, ఇక ముందు ఏమేమి చేయాలి" అన్నది చర్చించుకోవడానికే ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు ఈ. ఎన్నో ఉన్నత ఆశయాలు, పరమోన్నతమైన నాగరికత, విజ్ఞానం కల ఈ దేశం ఎందుకు ప్రపంచ దేశాలచే పరిహసించబడింది? అని ప్రశ్నిస్తూ, "మనం కేవలం కుటుంబం, చదువు, సంపాదన వరకే చూసుకుంటున్నామని, పక్కవారి కోసం, దేశం కోసం ఏమాత్రం పని చేయడం లేదని" అంటూ, దేశం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. స్వదేశీ వస్తువులను కొనవలసిన ఆవశ్యకతను వివరించి, ఉత్తమ పౌరులుగా మన బాధ్యతలను నిర్వర్తించాలని ఉద్బోధించారు. దేశంలో ఉన్న పరిస్థితులను ఆకళింపు చేసుకున్న డా॥ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, మన దేశానికి పట్టిన రోగానికి సరైన ఔషధం 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' రూపంలో ఇచ్చారని, ఆ సంఘం వందేళ్లుగా ఎటువంటి చీలికలు, పేలికలు కాకుండా, నాయకత్వ సమస్యలు లేకుండా నిరంతరం దేశం కోసం పని చేస్తోందని, ఆ సంఘం యొక్క శతాబ్ది ఉత్సవాలను మన మీ నాడు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. డాక్టర్ మేజర్ నిఖిలేశ్ మాట్లాడుతూ ముస్లిమ్ దురాక్రమణదారుల దాడులు, దండయాత్రల కారణంగా



ప్రపంచంలోని ఎన్నో దేశాల నాగరికతలు, ఘన సంస్కృతులు, ఆచార సంప్రదాయాలు పూర్తిగా ఎలా తుడిచిపెట్టుకు పోయాయో వివరించారు. కానీ ఎన్నో దుష్టుల దాడులను తట్టుకొని మన దేశం, మన సంస్కృతి బలంగా నిలిచి దినదినప్రవృద్ధమానమవుతున్నదంటే, దానికి కారణం బలమైన వసుధైక కుటుంబ భావనతో కూడిన మన కుటుంబ వ్యవస్థేనన్నారు. అటువంటి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత, మన పిల్లలకు చదువు, సంపాదన మాత్రమే కాకుండా సంస్కారం, విలువలు నేర్పించాలని బోధించారు. లవ్ జిహాద్ పేరుతో కులాల ప్రకారం ధర నిర్ణయించి మరీ హిందూ అమ్మాయిలను బలి చేస్తున్నారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డాక్టర్ మేజర్ నిఖిలేశ్ మాట్లాడుతూ సంఘ స్వయంసేవకులు దేశం కోసం నిస్వార్థంగా పని చేస్తూ దేశాన్ని 2047నాటికి ప్రపంచంలో నెంబర్ ఒన్ స్థానానికి తీసుకెళుతున్నారని అన్నారు. ఉత్సవానికి ముందుగా మహిళలు లలితా సహస్రనామ పారాయణం కావించారు. కార్యక్రమం మొదట అమ్మవారి పూజ, ఆయుధ పూజ, చివరన ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ గణవేషధారి స్వయంసేవకులతో పాటు పుర ప్రముఖులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కృషి ఐటిఐ, వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాలలలో ఆయుధ పూజ



యాదాద్రి భువనగిరి ప్రజాస్ఫూర్తి : ఆయుధ పూజను పురస్కరించుకొని కృషి ఐటిఐ మరియు వాత్సల్య ల్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆయుధపూజ దసరా పండుగలో ముఖ్యమైన భాగం. ఈ రోజు మనం ఉపయోగించే పరికరాలు, యంత్రాలు, వాహనాలు, ఆయుధాలు అన్నిటిని శుభ్రపరచి, అలంకరించి, పూజిస్తాం. ఇది కేవలం ఆచారం మాత్రమే కాదు మనకు ఉపకారకమైన సాధనాల పట్ల కృతజ్ఞత తెలుపే రోజు అని అన్నారు. కృషి ఐటిఐ మరియు వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వృత్తికి ఆయా పరికరాలు ఎంత ముఖ్యమో మనందరికీ తెలుసు. రైతుకు పంట కోసే పరికరాలు, కార్మికుడికి తన పనిముట్లు, సైనికుడికి ఆయుధాలు, విద్యార్థికి పుస్తకాలు ఇవన్నీ మన విజయానికి ఆధారాలు. ఆయుధపూజ మనలో క్రమశిక్షణ, శ్రమపట్ల గౌరవం, కృతజ్ఞతను పెంపొందిస్తుంది. ఈ రోజు మనం పరికరాలను పూజిస్తూ, "మన శ్రమే దేవత" అన్న సత్యాన్ని గుర్తుచేసుకోవాలి. కష్టపడి పనిచేస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని మనమంతా శుభ్రత, క్రమశిక్షణ, శ్రమపట్ల గౌరవం అనే విలువలను ఆచరిద్దాం. అందరికీ ఆయుధపూజ శుభాకాంక్షలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్ కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ తోపాటు తన్వి శ్రీ అక్షర, సాయి నిహాల్ మరియు కృషి ఐటిఐ అధ్యాపకులు, విద్యార్థులు మరియు వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## దేశ రక్షణే ఆర్ఎస్ఎస్ లక్ష్యం...

* ఆర్ఎస్ఎస్ హిందూయేతరులకు వ్యతిరేకం కాదు...
* ఆర్ఎస్ఎస్ గ్రామ ప్రముఖ్ కాడెం శ్రీనివాస్..
* కన్ సాన్ పల్లి లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు...

అందోలు, ప్రజాస్ఫూర్తి:
దేశ రక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ కోసమే ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని ఆర్ఎస్ఎస్ గ్రామ ప్రముఖ్ కాడెం శ్రీనివాస్ అన్నారు. అందోలు మండలం లోని కన్ సాన్ పల్లి గ్రామంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దుర్గా భవాని దేవాలయం వద్ద స్వయం సేవకులు పథ సంచాలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని మేల్కొల్పడం, ప్రజలను చైతన్యవంతం చేయటం ఆర్ఎస్ఎస్ శాఖల ముఖ్య లక్ష్యమన్నారు. ప్రతిఒక్కరూ దేశంకోసం పనిచేయాలని సూచించారు. ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టిన భారత సంస్కృతి ఎంతో గొప్పదన్నారు. ప్రస్తుతం 60 దేశాల్లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హిందూ దేవాలాయలపై ముష్కరుల దాడులను ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సేవకులు కాల్వమీది రమేష్, దేవునూరి మాణిక్యం, కలపల్లి భూమేష్, కిట్టు, వెంకట్, వెంకట గణేష్, దశరత్ లు పాల్గొన్నారు.

## తిరుమాడ వీధుల్లో కన్నుల పండువగా గరుడ సేవ



తిరుమల: సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఆదివారం శ్రీవేంకటేశ్వర స్వామివారు తనకు ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల దివ్యక్షేత్రంలో సాయంత్రం 6.30కి గరుడ వాహనసేవ మొదలైంది. భక్తుల గోవింద నామస్మరణతో తిరుగిరులు మార్మోగాయి. మాడవీధుల గ్యాలరీల్లోకి దాదాపు రెండు లక్షల మందికి పైగా భక్తులు చేరుకున్నారు. నందకం, రామ్‌బగీచా, లేపాక్షి ప్రాంతాల్లో భక్తులు బారులు తీరారు. తిరుమలలో వాహనాల పార్కింగ్ ప్రాంతాలు పూర్తి నిండిపోయాయి. శ్రీవారి మూలవిరాట్టుకు అలంకరించే లక్ష్మీహారం, మకరకంఠి ఆభరణాలను ఏడాదిలో ఒక్కసారి.. అదీ గరుడసేవ రోజు మాత్రమే ఉత్సవమూర్తి అయిన శ్రీమలయప్పస్వామికి అలంకరిస్తారు. ఉదయం స్వామివారు సర్వాలంకార భూషితుడై మోహినీ అవతారంలో శృంగార రసాది దేవతగా భక్తులను తన్మయపరిచారు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై అభయమిచ్చారు. తల్లిని బానిసత్వం నుంచి విడుదలచేసేందుకు వైనతేయుడు అమృతభాండాన్ని తీసుకువెళ్ళాడు. మాతృమూర్తిపై అచంచల విశ్వాసాన్ని ప్రదర్శించిన గరుత్మంతుడిని శ్రీమహావిష్ణువు తన వాహనంగా చేసుకున్నాడు. అందుకనే ఈ సేవను చూసేందుకు వేలాదిమంది భక్తులు తిరుమలకు తరలివస్తారు. అన్నమయ్య 'ఇటు గరుడుని నీ వెక్కినను, పటపట దిక్కులు బగ్గన బగిలె..' అంటూ ఆ కలియుగవైకుంఠనాథుని గరుడసేవ వైభవాన్ని పేర్కొన్నాడు. వాహన సేవల్లో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి శోభ.. విశేష అలంకరణల్లో అమ్మవారు

తెలుగు రాష్ట్రాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆ చిత్రాలు..













# దసరా రద్దీ.. కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు

హైదరాబాద్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో ప్రధాన బస్టాండ్లు అన్నీ రద్దీగా మారాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. మరోపక్క సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దక్షిణ మధ్య రైల్వే 2వేలకు పైగా ప్రత్యేక రైళ్లను, టీజీఎస్ఆర్టీసీ 7,754 ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. అయినప్పటికీ... ఏమాత్రం సరిపోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ప్రధాన బస్టాప్‌లు కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్ నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు వెళ్లే బస్సులు అత్యంత రద్దీగా మారిపోయాయి. జేబీఎస్ బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. ప్రత్యేక బస్సుల్లో అదనంగా 50 శాతం వరకు



అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. దసరా, దీపావళి పండుగల సందర్భంగా రైలు ప్రయాణాలు భారీగా పెరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన వాళ్లు...పండుగలను జరుపుకొనేందుకు సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి రైల్వే స్టేషన్లు రద్దీగా మారిపోయాయి. ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే 2 వేలకు పైగా ప్రత్యేక రైళ్లను నడుపుతోంది.

## తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి: కేటీఆర్



కల్వకుర్తి: కాంగ్రెస్, భాజపా జాయింట్ వెంచర్ నడుపుతున్నాయని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. మంత్రి పొంగులేటి నివాసంలో ఈడీ సోదాలు జరిగి ఏడాదైనా చర్యలు లేవన్నారు. కాంగ్రెస్, భాజపా ఒకటేనని, రాష్ట్ర ప్రయోజనాలను ఆ రెండు పార్టీలూ కాపడలేవని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి మండలం కడ్తాల్‌లో కేటీఆర్ పర్యటించారు. కడ్తాల్‌లో దీక్ష చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. మాట ఇచ్చి.. తప్పిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడినంత హీనంగా ఏ సీఎం మాట్లాడలేదని అన్నారు. ''రాష్ట్రం దివాళా తీసిందని సీఎం అంటే ఎవరు నమ్ముతారు? పాలమూరు, రంగారెడ్డిలో మిగిలిన 10శాతం పనులు పూర్తి చేయలేదు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 చొప్పున రూ.55 వేలు బకాయిలు ఇవ్వాలి. ఓట్ల కోసం వచ్చిన కాంగ్రెస్ నేతలను బకాయిలపై నిలదీయాలి. ఓట్ల కోసం డబ్బులు ఇస్తే తీసుకొని.. మిగతా బకాయిల గురించి అడగాలి. ఆల్మట్టి ప్రాజెక్టును ఆపే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా? లేదంటే గులాబీ దండు కదలాలా? ఆల్మట్టి ఎత్తు పెంపుపై రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి'' అని కేటీఆర్ అన్నారు.

## ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది.. కాపాడుకోవాలి

: **ప్రశాంత్ భూషణ్**



హైదరాబాద్: ఎన్నికల సంఘం, దర్యాప్తు సంస్థలు స్వతంత్రతను కలిగి ఉంటేనే ప్రజాస్వామ్యం ప్రాణంతో ఉంటుందని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. ప్రస్తుతం దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్, ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీలు పని చేయాలని ఆయన సూచించారు. స్వతంత్ర కమిషన్ ఉంటే ఓట్ల చోరీ జరగదని.. ప్రభుత్వాలు ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీలను భయపెట్టి పనులు చేయించుకునే పరిస్థితులు ఉండవని అభిప్రాయపడ్డారు. ప్రజల ఓట్లతో కాకుండా... ఈవీఎంలు విజయాన్ని డిసైడ్ చేస్తున్నాయని, ఈసీ పారదర్శకంగా పనిచేయటం లేదని విమర్శించారు. మత రాజకీయాలు చేస్తూ.. దేశంలో దొంగలు రాజ్యమేలుతున్నారని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. పేదవారి కోసం పోరాడిన వారు జైళ్లలో ఉంటున్నారని.. చంపిన వారు రాజ్యాన్ని ఏలుతున్నారని విమర్శించారు.





## ఎల్బీ స్టేడియం నుంచి బైక్, సైకిల్ ర్యాలీ.. ప్రారంభించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా బైక్, సైకిల్, స్కేటర్స్ ర్యాలీ నిర్వహించారు. ఎల్బీ స్టేడియం వద్ద ఈ ర్యాలీని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఎల్బీ స్టేడియం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది. హైదరాబాద్ విమెన్ బైకర్స్ సంప్రదాయ వస్త్రధారణతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి టూరిజం ప్రమోషన్‌లో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు.





## ఎంజీబీఎస్ నుంచి ప్రారంభమైన బస్సు సేవలు

హైదరాబాద్: మూసీ వరద ఉద్ధృతి తగ్గడంతో ఎంజీబీఎస్ తేరుకుంది. ఉదయం నుంచి ఆర్టీసీ సిబ్బంది ఇక్కడ పేరుకుపోయిన బురదను తొలగించారు. దీంతో ఎంజీబీఎస్ నుంచి ఆర్టీసీ బస్సు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం బస్‌స్టేషన్ ప్రయాణికులతో కళకళలాడుతోంది. శనివారం ఎంజీబీఎస్‌ను వరద ముంచెత్తడంతో ఇక్కడి నుంచి వెళ్లే బస్సు సర్వీసులను ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతాల నుంచి నడిపారు. ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, జేబీఎస్ నుంచి జిల్లాలకు బస్సులు నడిచాయి. ప్రస్తుతం బస్సు సర్వీసులు ఎంజీబీఎస్ నుంచే ప్రారంభించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఖిలా వరంగల్ లో

# అంబరాన్ని అంటిన బతుకమ్మ వేడుకలు



వరంగల్ జిల్లా యంత్రాంగం, మహా నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ లో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ కొండా సురేఖ హాజరు కాగా, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు, మహిళ ఉద్యోగులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తంగేడు పూలు, గునుగు పూలు, బంతిపూలు, చామంతులతో అందంగా పేర్చి మహిళలందరితో ఒక చోట కూడి చప్పట్లతో నృత్యాలు చేస్తూ సందడిగా బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మహిళలతో కలిసి స్వయంగా బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక విశిష్టతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను, రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాల్లో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ వేడుకలు మన వరంగల్ పట్టణంలో చారిత్రక వెయ్యి స్తంభాల గుడి నుండి ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. బతుకమ్మ అనేది కేవలం పూల పండుగ కాదని-ఇది ఆడబిడ్డల ఆశయాల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ, భూదేవికి సమర్పించే నైవేద్యమని,ఇది తల్లి, చెల్లి, అమ్మాయిల ప్రతి మదిలో మెదిలే గౌరవానికి నిలువెత్తు గుర్తని మంత్రి అన్నారు. సంప్రదాయం ఆధునికతల మేళవింపుగా, సంస్కృతి, ప్రకృతి, పర్యాటకంతో మమేకమయ్యేలా, సకల జనుల సమ్మేళనంతో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తొమ్మిది రోజులు అమ్మవారిని కొలుసుకుంటామని అన్నారు. "బతుకు చైతన్యం - బతుకమ్మ ఆరాధనం" అన్నట్లుగా, ఇది తెలంగాణ ఆడబిడ్డల గొంతులో ఊసెత్తే ఉయ్యాల పాట అన్నారు. బతుకమ్మ వెనుక సైంటిఫిక్ రీజన్ ఉందన్నారు. ఎన్నో ఔషధ గుణాలున్న బతుకమ్మ పూలతో చెరువులు శుద్ధి అవుతాయని అన్నారు. తంగేడు, గునుగు, కట్ల పూలు యాంటీ బయోటిక్. పంటలిచ్చిన చెరువులను మొక్కుకోవడం బతుకమ్మ ఆచారం. తాగునీళ్లు కూడా గతంలో చెరువులు ఇచ్చేవని అన్నారు. చెరువులకు కృతజ్ఞతా భావం తెలపడమే బతుకమ్మ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. మన ఘనత ప్రపంచం మొత్తం తెలిసేలా, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు అయ్యేలా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించబోయే బతుకమ్మ పండుగను ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మంత్రి ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బైరబోయిన ఉమా, భోగి సువర్ణ, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, పోశాల పద్మ, డిఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిల్లా అధికారులు, తహశీల్దార్, మెప్మా సిబ్బంది, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తమిళనాడులో రిజర్వేషన్లపై అధ్యయనం చేయాలి

: **ఎంపీ ఈటల**



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కామారెడ్డి డిక్లరేషన్ లో విద్యా ఉద్యోగాలు రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి వాటిని అమలు చేయకుండా కుట్రలు చేస్తుందని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, జడ్పీ చైర్మన్ల ఎన్నికలు వాయిదా వేసేందుకు రాత్రికి రాత్రికి జీవో తీసుకొచ్చారని మండిపడ్డారు. ఈజీవో గురించి దాంట్లో నిజాలు ఏమిటో ప్రజలకు తెలుసునని, కనీస అవగాహన లేనివారు చదువుకోని వారు ఎవరున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఎన్నో జడ్జిమెంట్లు ఇచ్చిందని, ఇప్పుడు బీసీలను మోసం చేసి స్థానిక ఎన్నికలు వాయిదా వేయడానికి వేసిన ఎత్తుగడని రాజ్యాంగ నిపుణులు చెప్తున్నారని పేర్కొన్నారు. ఒక పనిచేసేటప్పుడు పూర్తిగా ఆలోచన చేయాలని, వ్యవస్థను నడుపుతున్నారని ప్రభుత్వం అంటే డ్రామా కంపెనీ కాదని మండిపడ్డారు. సమగ్రమైన రిపోర్ట్ అందించకుండా కోర్టులను చట్టబద్ధంగా ఒప్పించకుండా ఇది జరిగేలా కనిపించడం లేదు. కోర్టులు రాజ్యాంగానికి లోబడి పనిచేస్తాయి. సీఎం రేవంత్‌రెడ్డి పైరవీ చేయడానికి ఇది భూముల పంచాయతీ కాదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి ఇలాంటి పనులు మానుకుంటే బాగుంటుందని సూచించారు. అమలు కాకపోతే ఏ పార్టీకి ఆ పార్టీలు ఇచ్చుకోవాలని మాట్లాడటం హాస్యస్పదంగా ఉందన్నారు. తాము చేయాలని అనుకున్నామని, న్యాయ స్థానం కొట్టివేసిందని చెప్పకోవడానికి ఇదంతా నాటకమన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మంత్రి వర్గంలో బీసీలకు ఎందుకు 42 శాతం పదవులు ఇవ్వలేక పోయారని, ఇస్తే ఎవరు ఆపుతారని పేర్కొన్నారు. నిజాయితీతో ఎన్నికలు నిర్వహిస్తే ఎవరు అడ్డుకోరని, చట్టాన్ని అపహాస్యం చేయవద్దని సూచించారు. డ్రామాలు ఆపి రాష్ట్ర ప్రజలకు ఏం చేయబోతున్నారు చెప్పి వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు ఎలా అమలు అవుతున్నాయో అధ్యయనం చేయాలని, తూతూ మంత్రంగా చేయవద్దని తెలిపారు. అక్కడ 25 మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో విద్యా ఉద్యోగ సామాజిక అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకొని సమగ్రసర్వే చేసిన రిపోర్టుతో కోర్టులను ఒప్పించారని, అందుకే అక్కడ రిజర్వేషన్ సాధ్యం అయ్యిందన్నారు. అక్కడ స్టడీ చేసి ఇక్కడ అమలు జరిగే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఒకే రోజు 300 స్కూళ్లు, పలు ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపులు

దేశ రాజధాని సహా దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యా సంస్థలు, విమానాశ్రయాలే లక్ష్యంగా బాంబు బెదిరింపులు ఇటీవల ఎక్కువైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం ఒక్కరోజే దిల్లీలో వందలాది పాఠశాలలు, విద్యా సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా అనేక ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. రంగంలోకి దిగిన పోలీసులు.. నకిలీ బెదిరింపులేనని తేల్చడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. "మీ భవనం చుట్టూ బాంబులు ఉన్నాయి. 24 గంటల్లో స్పందించండి. లేదంటే విపత్తు ఎదుర్కోవాల్సిందే'' అని అందులో పేర్కొన్నారు. రెండు సీఆర్‌పీఎఫ్ పబ్లిక్ స్కూల్‌లు కూడా ఈ బెదిరింపు లేఖలు అందుకున్న వాటిలో ఉన్నాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసు, అగ్నిమాపక, బాంబ్ స్క్వాడ్ బృందాలు ముమ్మర సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లేవని గుర్తించాయి. బెదిరింపు మెయిల్స్ 'టెర్రరైజర్స్111' గ్రూపు పేరుతో వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, గతంలోనూ ఈ పేరుతో ఇటువంటి మెయిల్స్ పంపించినట్లు తెలిపారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 300లకుపైగా పాఠశాలలు, విద్యా సంస్థల ఈమెయిల్స్‌కు ఈ మెసేజ్‌లు వచ్చాయని చెప్పారు. దిల్లీ ఎయిర్‌పోర్టు సహా దేశంలో ఇతర విమానాశ్రయాలకు ఈ తరహా బెదిరింపులు వచ్చాయి.




## ఈ పట్టణం.. దసరా వేడుకలకు దూరం!

ధర్మశాల: దసరా పండగను దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. రావణాసురుడిని శ్రీరాముడు సంహరించిన రోజుగానూ దీన్ని చేసుకుంటారు. ఉత్సవాలు, బాణసంచా కాల్చడం, రావణ దహనం, రామ్‌లీలా ప్రదర్శనలతో సందడి నెలకొంటుంది. కానీ, హిమాచల్ ప్రదేశ్‌లో పురాతన శివాలయానికి ప్రసిద్ధి చెందిన బైజ్‌నాథ్ పట్టణం మాత్రం విజయ దశమి వేడుకలకు దూరంగా ఉంటుంది. కారణం.. ఇక్కడ రావణుడిని రాక్షసుడిగా కాకుండా మహాదేవుడి పరమ భక్తుడిగా భావించడమే. శంకరుడిని ప్రసన్నం చేసుకునేందుకు లంకానాథుడు బైజ్‌నాథ్‌లో తపస్సు చేశాడని నమ్ముతుంటారని, అందువల్ల రావణ దహనాన్ని అగౌరవంగా భావిస్తారని ఓ స్థానిక పూజారి తెలిపారు. గతంలో



ఇక్కడ దసరా చేసుకునేందుకు కొంతమంది ప్రయత్నించినప్పటికీ.. వారిని దురదృష్టం వెంటాడినట్లు, మరణాలూ సంభవించినట్లు స్థానికులు చెబుతుంటారు. అదేవిధంగా.. ఇక్కడ స్వర్ణకారుల దుకాణాలు కనిపించవు. పార్వతీ దేవీ శాపం కారణంగానే వాటిని ఏర్పాటు చేయరనే ప్రచారమూ ఉంది.

## మద్యం వినియోగంలో కర్ణాటక టాప్



భారత్‌లో తయారయ్యే విదేశీ మద్యం వినియోగంలో దక్షిణాది రాష్ట్రాలు ముందున్నాయి. మద్యం అమ్మకాలకు సంబంధించి గత ఆర్థిక సంవత్సరంలో 58శాతం రాబడి ఈ రాష్ట్రాల నుంచే వచ్చింది. దేశవ్యాప్తంగా విస్కీ వినియోగంలో కర్ణాటక తొలి స్థానంలో నిలిచిందని (అమ్మకాల్లో 17శాతం) కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ వెల్లడించింది. పుదుచ్చేరితోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు మద్యం అమ్మకాల్లో జోరును కొనసాగించాయి. దేశవ్యాప్తంగా 40.17 కోట్ల విస్కీ కేసుల అమ్మకాలు జరగగా.. దక్షిణాది రాష్ట్రాల్లోనే 58శాతం వినియోగం కనిపించింది. ఈ రాష్ట్రాల్లో 23.18 కోట్ల కేసులు అమ్ముడైనట్లు సీఐఏబీసీ వెల్లడించింది. కర్ణాటకలో అత్యధికంగా 6.88 కోట్ల కేసులు (17శాతం) అమ్ముడవగా, 6.47 కోట్ల కేసులతో తమిళనాడు (16శాతం) రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ (3.55 కోట్లు), తెలంగాణ (3.1 కోట్లు), కేరళ (2.29 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 0.28 కోట్ల కేసుల అమ్మకాలతో పుదుచ్చేరి 19వ స్థానంలో నిలిచింది. మహారాష్ట్రలో గతేడాది 2.71 కోట్ల విస్కీ కేసులు అమ్మడయ్యాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో అత్యధికంగా 2.50 కోట్ల కేసులతో జాతీయ స్థాయిలో ఆరో స్థానంలో నిలిచింది. రాజస్థాన్, దిల్లీ, హరియాణా రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే దక్షిణాదిలో ఒకశాతం వినియోగం పెరగగా.. యూపీలో 6శాతం పెరిగింది. ఝార్ఖండ్, రాజస్థాన్, పుదుచ్చేరిలలో 10శాతానికి పైగా వృద్ధి కనిపించింది. ఏటా రాష్ట్రాలు గణనీయంగా పన్నులు పెంచడంతోపాటు మద్యం విధానాల్లో మార్పులు తెస్తుండటం ద్వారా అమ్మకాలపై ప్రభావం పడుతోందని సీఐఏబీసీ డైరెక్టర్ జనరల్ అనంత్ ఎస్ అయ్యర్ పేర్కొన్నారు.




## బిహార్ ఎన్నికలకు.. పరిశీలకులుగా 320 మంది IAS, 60 IPSలు

బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోన్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. ఈ క్రమంలో 470 మంది అబ్జర్వర్లను నియమించనున్నట్లు పేర్కొంది. వీరిలో 320 మంది ఐఏఎస్, 60 మంది ఐపీఎస్‌తోపాటు మరో 90 మంది ఇతర ఉన్నతాధికారులు ఉండనున్నట్లు తెలిపింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు మరో ఏడు స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ సిద్ధమవుతోంది. అయితే, ఎన్నికల సమయంలో అవకతవకలకు తావులేకుండా చూడటం, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాత పోటీ వాతావరణం కల్పించడం కోసం జనరల్, పోలీసులు, ఖర్చుల పరిశీలకులను ఈసీ నియమిస్తుంది. అక్టోబర్ తొలివారంలో బిహార్‌లో ఎన్నికల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించనున్న ఈసీ.. అంతకుముందు రోజే పరిశీలకులకు దిశానిర్దేశం చేయనుంది. ఇదిలాఉంటే, 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 22తో ముగియనుంది. ఇందుకోసం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈసీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయగా.. ఇందుకు సంబంధించిన అంశం సుప్రీం కోర్టు విచారణలో ఉన్న విషయం తెలిసిందే.

## మన వ్యవస్థలోనే ఏదో లోపముంది
## వరుస తొక్కిసలాట ఘటనలపై థరూర్

కరూర్‌లో సినీనటుడు, టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 39మంది ప్రాణాలు కోల్పోవడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ విచారం వ్యక్తం చేశారు. దేశంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఇటువంటి ఘటనలు మన వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతున్నాయన్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడాన్ని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమవ్వాలని అన్నారు. ప్రముఖులు నిర్వహించే అన్ని రకాల కార్యక్రమాలకు కఠిన నియమాలను, భద్రతా ప్రోటోకాల్‌లను



రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మన దేశంలో జనసమూహ నిర్వహణను అమలు చేయడంలోనే ఏదో తప్పు జరుగుతోందని..అందువల్లే ప్రతి ఏడాది ఏదో ఒక ప్రాంతంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. సాధారణ ప్రజల భద్రత, ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని.. జాతీయ స్థాయిలో ఇటువంటి సభలు, సమావేశాల ఏర్పాటుకు కఠిన నిబంధనలు రూపొందించాలని కోరారు. తమిళనాడు కరూర్‌లో విజయ్ ప్రచార ర్యాలీలో ఈ తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇక్కడ జరిగిన తొక్కిసలాటలో 40 మంది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో విజయ్ (Vijay) ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.20లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, గాయపడినవారికి రూ.లక్ష పరిహారం అందిస్తామని తమిళనాడు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.

## 'కుటుంబం కోసం'..
## నెట్టింట వైరల్‌గా మారిన డెలివరీ బాయ్ మెసేజ్

మాటలు రాకపోయినా, చెవులు వినిపించకపోయినప్పటికీ కుటుంబం కోసం ఫుడ్ డెలివరీ బాయ్‌గా తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నాడో వ్యక్తి. అతడికి సంబంధించిన మెసేజ్ స్క్రీన్‌షాట్‌ను స్తుతీ అనే యూజర్ ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఈ పోస్ట్ కొద్దిసేపట్లోనే తొమ్మిది లక్షలకు పైగా వ్యూస్ సాధించింది. నెటిజన్లు ఆ డెలివరీ బాయ్ పట్టుదల, తన బాధ్యత నిర్వర్తించిన తీరును కామెంట్ల రూపంలో ప్రశంసించారు. కుటుంబం కోసం పురుషులు పడే శ్రమగా అభివర్ణిస్తూ.. ఆమె పెట్టిన పోస్టులో.. 'నేను మీ ఆర్డర్‌ను తీసుకున్నాను. మరికాసేపట్లో డెలివరీ చేస్తాను. నేను మాట్లాడలేను, వినలేను. అడ్రెస్ వద్దకు వచ్చాక మెసేజ్ చేస్తాను. దయచేసి చూడండి' అని ఆ డెలివరీ బాయ్




కస్టమర్‌కు సందేశం పంపినట్లు ఉంది. ఈ పోస్ట్‌పై ఓ యూజర్ స్పందిస్తూ... 'మనకు ఆహారం తీసుకురావడానికి వారు ఎటువంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారో తెలీదు. వారికి టిప్ ఇస్తే కొంతైనా సాయంగా ఉంటుంది' అని కామెంట్ చేశారు. 'సమస్యలున్నా తప్పించుకోకుండా కష్టపడుతున్నాడు. తన జీవితం మెరుగుపరుచుకోవాలనే కృషి కనిపిస్తోంది' అని మరో యూజర్ రాశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కాంకేర్, గరియాబంద్ జిల్లాల సరిహద్దులోని రావాస్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఉదయం నుంచి ఇరువైపుల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మృతుల్లో మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు



కూడా ఉన్నట్లు గుర్తించామన్నారు. కాల్పులు ముగిసిన తర్వాతే మృతులపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముందన్నారు. ప్రస్తుత ఆపరేషన్‌తో కలిపి.. ఈ ఏడాది చత్తీస్‌గఢ్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 252 మంది మావోయిస్టులు హతమయ్యారని తెలిపారు.

## ప్రపంచంలో ఎత్తయిన వంతెన షురూ..
## 2 గంటల ప్రయాణం రెండు నిమిషాల్లోనే!

భారీ నిర్మాణాల విషయంలో చైనా మరో ఘనత సాధించింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వంతెనను ప్రారంభించింది. గుయ్‌ఝౌ ప్రావిన్స్‌లో బీపన్ నది లోయపై 2051 అడుగుల ఎత్తులో ఈ హువాజియాంగ్ గ్రాండ్ కన్యాన్ వంతెనను నిర్మించారు. 2022లో దీని నిర్మాణాన్ని ప్రారంభించగా.. కేవలం మూడేళ్లలోపే పూర్తి చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం 280 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.2400 కోట్లు) ఖర్చు పెట్టినట్లు సమాచారం. ఈ వంతెన ప్రారంభంతో రెండు వైపులా మధ్య ప్రయాణ సమయం రెండు గంటల నుంచి రెండు నిమిషాలకు తగ్గిందని ప్రాంతీయ రవాణా విభాగం చీఫ్ జాంగ్ యిన్ తెలిపారు. స్థానికంగా ఆర్థిక, వాణిజ్య పురోగతికి ఇది ఊతమిస్తుందన్నారు. ప్రస్తుతం ఈ వంతెన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రపంచంలో రెండు అతిపెద్ద వంతెన (డ్యూజ్ బ్రిడ్జ్) కూడా ఇదే ప్రావిన్స్‌లో ఉంది. ప్రపంచంలోనే 100 అత్యంత ఎత్తయిన వంతెనల్లో దాదాపు సగం చైనాలోనే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## అక్టోబర్ 2న ఖాదీ వస్త్రాలే ధరించండి: మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ

'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులే విక్రయించాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్‌కీ బాత్ 126వ కార్యక్రమంలో ఆదివారం మోదీ మాట్లాడుతూ.. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి.. ధరించాలని కోరారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారన్నారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ.. గత 11 ఏళ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని అన్నారు. ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి



దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని, కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలన్నారు.

*** భారత పుత్రికలు ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోగలరు..**

భారత నావికాదళానికి చెందిన ఇద్దరు అధికారిణులు, లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూపల ధైర్య సాహసాలను ప్రధాని మోదీ ప్రశంసించారు. సముద్ర గర్భంలో వారు చూపుతున్న తెగువను కొనియాడారు. భారత పుత్రికలు కఠినమైన పరిస్థితులను సైతం సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. మన్‌కీ బాత్‌లో భాగంగా వారిరువురితో ఫోన్‌లో సంభాషించారు.

*** భగత్ సింగ్, లతా మంగేష్కర్‌లకు నివాళి..**

స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్, భారతరత్న, ప్రముఖ గాయని లతా మంగేష్కర్‌ల జయంతి సందర్భంగా ప్రధాని మోదీ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ ఉరికంబం ఎక్కారని..దానికి ముందు ఆయన ఆంగ్లేయులకు లేఖ రాశారని అన్నారు. ఇందులో తమను ఉరి కంబాలకు బదులు తూటాలతో చంపాలని భగత్‌సింగ్ కోరినట్లు తెలిపారు. ఆ లేఖ ఆయన సాహసానికి నిదర్శనమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భగత్ సింగ్ ఎప్పుడూ ముందుండే వారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ పాడిన దేశభక్తి గీతాలు ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు.




### రామ్ చరణ్ సినీ ప్రస్థానానికి

# 18 ఏళ్లు.. చిరంజీవి స్పందన

**ఆ క్షణం నాన్నగా మర్చిపోలేను.. చరణ్‌పై చిరు ఎమోషనల్ ట్వీట్**

**చరణ్ క్రమశిక్షణ, అంకితభావంపై ప్రశంసలు**

**తండ్రిగా ఎప్పుడూ గర్వపడతానన్న మెగాస్టార్**

**ఈ సందర్భంగా 'పెద్ది' మూవీ కొత్త పోస్టర్ విడుదల**

**సోషల్ మీడియాలో ఫ్యాన్స్ సంబరాలు**

**టాకీస్:** 'గ్లోబల్ స్టార్' రామ్ చరణ్ సినీ రంగంలోకి అడుగుపెట్టి 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, తండ్రి మెగాస్టార్ చిరంజీవి తన ఆనందాన్ని, గర్వాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. తన కుమారుడి విజయవంతమైన ప్రయాణాన్ని చూసి ఓ తండ్రిగా తాను ఎంతగా మురిసిపోతున్నారో వివరిస్తూ నేడు ఓ భావోద్వేగభరితమైన పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం మెగా అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా చిరంజీవి స్పందిస్తూ, "చరణ్ బాబు, 18 ఏళ్ల క్రితం 'చిరుత'తో మొదలైన నీ సినీ ప్రయాణం, నేడు కోట్లాది అభిమానుల హృదయాల్లో నిలిచినందుకు చాలా సంతోషిస్తున్నాను. నిన్ను మొదటిసారి హీరోగా తెరపై చూసిన ఆ క్షణాన్ని ఓ తండ్రిగా నేనెప్పటికీ మర్చిపోలేను" అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. రామ్ చరణ్‌లోని క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల, వినయం వంటి లక్షణాలే అతడిని ఈ స్థాయిలో నిలబెట్టాయని కొనియాడారు. "దేవుడి ఆశీస్సులు, ప్రేక్షకుల అభిమానంతో నువ్వు మరెన్నో శిఖరాలను అధిరోహించాలి" అంటూ చిరంజీవి తన కుమారుడికి ప్రేమపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని రామ్ చరణ్ నటిస్తున్న కొత్త చిత్రం 'పెద్ది' టీమ్ అభిమానులకు ట్రీట్ ఇచ్చింది. ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఈ సినిమా 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఆ పోస్ట్ లో ప్రకటించారు.

## ఫర్హాన్ అక్తర్ '120 బహదూర్' టీజర్ విడుదల




**టాకీస్:** బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం '120 బహదూర్'. 1962లో జరిగిన భారత్-చైనా యుద్ధం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని రజనీష్ (రాజీ ఫేమ్) దర్శకత్వం వహిస్తుండగా.. పరమ వీర చక్ర పురస్కార గ్రహీత మేజర్ సైతాన్ సింగ్ భాటి పాత్రలో ఫర్హాన్ అక్తర్ నటించబోతున్నాడు. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రం నవంబర్ 21, 2025న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా సెకండ్ టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. భాగ్ మిల్కా భాగ్ తర్వాత ఫర్హాన్ అక్తర్ మరోసారి బయోపిక్ చేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

## ధన పిశాచి వచ్చేస్తుంది..

**సుధీర్ బాబు జటాధర నుంచి సోనాక్షి సిన్హా లుక్ వైరల్**

టాకీస్: హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా చేసే యాక్టర్లలో ఒకరు టాలీవుడ్ నటుడు సుధీర్ బాబు. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర. వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా ఈ మూవీ సాంగ్ అప్‌డేట్ అందించారు. ఈ విజయదశమి అక్టోబర్ 1 ధన పిశాచి వస్తుంది. చెడు నయా అవతారాన్ని చూసేందుకు రెడీగా ఉండండి.. అంటూ మేకర్స్ సోనాక్షి సిన్హా పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ చూస్తుంటే ఇందులో సోనాక్షి సిన్హా డబ్బు పిచ్చి ఉన్న వ్యక్తి పాత్రలో కనిపించబోతున్నట్టు తెలుస్తోంది. మొత్తానికి తాజా లుక్‌తో సినిమాపై హైప్ అమాంతం పెంచేస్తున్నారు మేకర్స్. ఈ మూవీ నుంచి సోల్ ఆఫ్ జటాధర ట్రాక్ ప్రోమోను విడుదల చేయగా.. ఓం నమ : శివాయ్ అంటూ సాగుతున్న ప్రోమో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్లలో ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టుకున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలో నటిస్తోంది.




# అనుదీప్‌తో సినిమా చేస్తున్నా..

**కామెడీ చేయడం చాలా కష్టమైన పని : కయాదు లోహర్**



టాకీస్: శ్రీవిష్ణు నటించిన అల్లూరి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది అస్సామీ సుందరి కయాదు లోహర్. ఈ ఏడాది ప్రదీప్ రంగనాథన్ నటించిన డ్రాగన్ మూవీతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ ముద్దుగుమ్మ జాతిరత్నాలు డైరెక్టర్ అనుదీప్‌తో సినిమా చేస్తుందట. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది. అంతేకాదు కామెడీ చేయడం ఎంత కష్టమో చెప్పింది కయాదు లోహర్. నేను అనుదీప్ డైరెక్షన్‌లో వస్తోన్న ఓ సినిమాలో నటిస్తున్నా. ఈ మూవీ పూర్తిగా కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. సినిమాలోని చాలా డైలాగ్స్ షూటింగ్ స్పాట్‌లో ఆలోచించి రాసినవే. ప్రతీ ఐదు నిమిషాలకోసారి వచ్చే సీన్ కొత్తగా చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. కామెడీ చేయడం చాలా కష్టమైన పని. ఎందుకంటే నేను అనుదీప్ సార్‌తో ఓ సినిమా చేస్తున్నా. కామెడీ చాలా కష్టమని తెలుసుకున్నా. ఎందుకో నాకు తెలియదు కానీ దానికి భాష కూడా ముఖ్యమే. మీకు భాష తెలిసినప్పుడు దాని అర్థమేంటో.. ఆ సంస్కృతి ఏంటో మీకు తెలుస్తుంది. తద్వారా కామెడీ కూడా సహజంగానే వస్తుంది. సంస్కృతితోపాటు ప్రేక్షకుల నాడి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. నాకు నవ్వించే స్వభావం ఉందని నమ్ముతా. కానీ కామెడీ చేయాల్సి వస్తే మాత్రం అది చాలా కష్టమైన పని. అది షూటింగ్ చేసేటప్పుడు చాలా చాలా కష్టంగా ఉంటుంది. ప్రతీ పంచ్ సరిగ్గా వేయాలి.. ప్రతీ టేక్‌ను సరైన విధంగా వచ్చేలా చూసుకోవాలి. కామెడీ అనేది స్క్రిప్ట్‌పై ఆధారపడే కాకుండా స్పాట్‌లో ఆయన (అనుదీప్)చాలా డైలాగ్స్‌తో రాస్తుంటారు. నాకు ఒక డైలాగ్ ఉందంటే మళ్లీ ఐదు నిమిషాల తర్వాత మరో డైలాగ్ వస్తుంటుంది. ఈ సంభాషణలు, కామెడీ ప్రతీ సారి కొత్తగా మారుతూనే ఉంటాయి. ఒక నా భాష (అస్సామీ)లో కామెడీ చేస్తే అంత కష్టం కాదు. కానీ వేరే భాషలో చేయాలంటే చాలా కష్టం అంటూ చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ అనుదీప్ కయాదు లోహర్‌ను ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కయాదు లోహర్ 2021లో ముగిల్‌పేట అనే కన్నడ మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మలయాళంలో పాథోన్‌పథం నూట్టుండు సినిమాలో నటించిన ఈ బ్యూటీ అనంతరం శ్రీ విష్ణు సరసన 'అల్లూరి' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మరోవైపు మరాఠీలో కూడా నటించింది.

### ఇక బాబాయ్‌తో.. కొరటాల శివ-బాలకృష్ణ

# కాంబో ఆన్ ది వే..!

**టాకీస్:** బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్నాడు టాలీవుడ్ యాక్టర్ నందమూరి బాలకృష్ణ. ప్రస్తుతం అఖండ 2లో నటిస్తుండగా.. డిసెంబర్ 5న ఈ మూవీ విడుదల కానుంది. దీంతోపాటు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో హిస్టారికల్ యాక్షన్ ఫిలింను ప్రకటించాడు. కాగా ఇప్పుడు బాలయ్యకు సంబంధించిన మరో ఆసక్తికర వార్త ఫిలింనగర్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. మిర్చి, శ్రీమంతుడు, జనతా గ్యారేజ్, దేవర సినిమాలతో ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు డైరెక్టర్ కొరటాల శివ.



ఈ టాలెంటెడ్ డైరెక్టర్ నెక్ట్స్ బాలయ్యతో ఓ సినిమాను లైన్‌లో పెట్టబోతున్నాడన్న వార్త నెట్టింట మార్మోగుతుంది. జూనియర్ ఎన్టీఆర్ ప్రశాంత్‌నీల్‌తో చేస్తున్న డ్రాగన్‌తో బిజీగా ఉన్న నేపథ్యంలో మరోవైపు కొరటాల దర్శకత్వంలో టైటిల్ రోల్‌లో నటిస్తోన్న సీక్వెల్ దేవర 2 ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో కొరటాల శివ కొత్త స్క్రిప్ట్‌లను రెడీ చేసే పనిలో ఉన్నాడట. బాలకృష్ణ కోసం ప్రత్యేకించి ఓ సినిమా కూడా ప్లాన్ చేస్తున్నాడని వార్తలు ఇప్పుడు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. ఈ మూవీ బాలకృష్ణకు సరిగ్గా సూటయ్యేలా ఉండబోతుందని నెట్టింట జోరుగా చర్చ నడుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే బాలకృష్ణ, కొరటాల శివ కాంబోలో రాబోతున్న తొలి సినిమా కానుంది.

బాలయ్య నటించిన సింహా సినిమాకు కొరటాల శివ డైలాగ్స్ అందించినప్పటికీ డైరెక్టర్ బోయపాటి శ్రీను ఆ క్రెడిట్ ఇవ్వలేదని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొరటాల బాలకృష్ణ మధ్య చర్చలు నడుస్తోంది. మరి రాబోయే రోజుల్లో ఈ సినిమాపై ఏమైనా స్పష్టత వస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్, అభిమానులు. అప్పుడు అబ్బాయి తారక్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన కొరటాల ఇక ఇప్పుడు బాబాయితో కలిసి ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

## 'కాంతార: చాప్టర్ 1' నుంచి 'బ్రహ్మ కలశ' సాంగ్ విడుదల

టాకీస్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కన్నడ చిత్రం 'కాంతార'కు ప్రీక్వెల్‌గా వస్తున్న 'కాంతార: చాప్టర్ 1' నుంచి విడుదలైన ఓ పాట ఇప్పుడు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా మొదటి భాగంలో క్లైమాక్స్‌లో వచ్చే 'వరాహరూపం' పాట ఎంతటి ఆదరణ పొందిందో తెలిసిందే. అదే తరహాలో,




ఈ ప్రీక్వెల్‌లో కూడా శక్తివంతమైన పాటను మేకర్స్ చేర్చారు. తాజాగా విడుదలైన ఈ పాట 'బ్రహ్మ కలశ' పేరుతో శివుడిని భక్తితో ఆరాధించే విధంగా, శక్తిమంతమైన సంగీతంతో ఉంది. ఈ పాట వింటుంటేనే మొదటి భాగంలోని 'వరాహరూపం' పాట ఇచ్చే అనుభూతిని గుర్తు చేస్తోందని అభిమానులు అంటున్నారు. ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా.. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించాడు. అబ్బి వి పాడాడు. రిషబ్ శెట్టి మార్క్ మేకింగ్‌తో, అజనీష్ లోక్‌నాథ్ సంగీతంతో ఈ పాట యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉంది. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ ప్రాజెక్ట్పై దేశవ్యాప్తంగా అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. 'కాంతార: చాప్టర్ 1' సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.